# గడువు

## ప్రతాప వెంకట సుబ్బారాయుడు

రామారావు మనసంతా బాధగా ఉంది. గడియారం వంక చూశాడు. రాత్రి ఎనిమిది గంటలు. 'ఇహ తప్పదు ఇంటికెళ్ళాలి' అనుకుని నిరాసక్తంగా సీటునుండి లేచాడు.

'హమ్మయ్య ఇప్పటికైనా లేచాడు గురుడు' విసుగ్గా అనుకుంటూ... ఆయన ఎంత త్వరగా వెళ్ళిపోతే అంత త్వరగా ఇంటికెళ్ళొచ్చు అన్న ఉత్సాహంతో తాళాలు పట్టుకొచ్చాడు సాంబయ్య.

రామారావు నిదానంగా ఫైల్స్ షెల్ఫ్‌లో పెట్టి ఫ్యాన్, లైట్ స్విచ్ఛాఫ్ చేస్తుంటే, కాస్త కోపాన్ని విసుగులో కలగలుపుతూ "అవన్నీ నేను చూసుకుంటాను" అన్నాడు సాంబయ్య 'ఇహ మీరెళ్తే చాలు' అన్న అర్థాన్ని స్ఫురింపజేస్తూ. రామారావుకి అర్థం అయింది.

రామారావు అతనివంకోసారి చూసి బయటకొచ్చి బస్టాపులో బస్సుకోసం నించున్నాడు. అతనుండే ఏరియాకి పదినిముషాలకో బస్సుంటుంది.ఓ పది బస్సులు వెళ్ళిపోయాక బస్సెక్కాడు. బస్టాపులో దిగి పది నిముషాల్లో చేరుకోవాల్సిన ఇంటిని అరగంటకి చేరాడు.

అతనెళ్ళేసరికి పిల్లలూ వాళ్ళావిడ నిద్దరపోతున్నారు. అతనికి కావలసిందదే!

తలుపు కొట్టాడు. భార్య తలుపు తీసింది.

"పిల్లలు నిద్రపోయారా?" అడిగాడు లోపలికి అడుగుపెడుతూ ఏదో ఒకటి మాట్లాడాలన్నట్లుగా...

"ఊ" ముక్తసరిగా సమాధానం చెప్పి వంటింట్లోకి దారితీసింది రామారావుకు అన్నం పెట్టడానికి.

అది గ్రహించి "నాకు ఆకలిగా లేదు" అన్నాడు.

"మీకు మామూలేగా... కాస్త మజ్జిగన్నం తిందురుగాని రండి" అంది రామారావు భార్య.

నిజానికి ఆకలి లేకపోవడం కాదు. చంపేసుకున్నాడు. లేకపోతే అక్కడ అన్నం తినేప్పుడు కొన్ని మాటలు చోటుచేసుకుంటాయి అవి తప్పించుకోవాలంటే తప్పదు,కాని అర్థాంగి ఊరుకుంటేకదా!

కాళ్ళూ చేతులూ కడుక్కుని కంచం ముందు కూర్చున్నాడు. అన్నం,అన్నంలో నీళ్ళమజ్జిగ పోసి కాస్త ఉప్పు వేసింది. కలుపుకుని మొదటిముద్ద తిన్నాడు. నాలుకకందిన ఆ రుచి మెదడుకందేలోగా-

"పొద్దున ఇంటి ఓనర్ పరంధామం గారు వచ్చారు. ఇప్పటికే మనం రెండునెల్ల అద్దె బాకీ ఉన్నామన్న విషయం తిట్లతో గుర్తుచేసి వచ్చే నెల అయిదవతారీకు లోపల తీర్చకపోతే సామాను బయటపడేయిస్తానని ఘాటుగా తీవ్రపదజాలంతో తెలియజేసి వెళ్ళిపోయాడు" అంది. ఆమె గొంతులో వినిపించిన వణుకు పొద్దుట ఎంత సీన్ జరిగిందో తెలియజెప్పింది.

మొదలైంది... దేనిగురించైతే తను భయపడ్డాడో అది మొదలైంది. "పాపకి ఫీజు కడితేనే పరీక్ష రాయనిస్తానని మేడమ్ చెప్పిందట. రెండురోజుల గడువిచ్చి, ఫీజుతోటే స్కూలుకి రమ్మందట.

పాప ఏడుస్తూ స్కూలుకెళ్ళిన గంటలోనే తిరిగి వచ్చేసింది" అని కాస్త ఆగి "మెడికల్ షాప్ రమణ వచ్చి పెద్దావిడ మందులకోసం ఇప్పటిదాకా చేసిన అప్పు తీర్చమని ఒత్తిడిచేసి ఎల్లుండికల్లా ఎట్టి పరిస్థితుల్లో తీర్చేయమన్నాడు" అంది.

రెండవముద్ద నోట్లో పెట్టుకోలేకపోతున్నాడు. కంచంలో చేయి కడుక్కుందామంటే ప్రాణం ఒప్పట్లేదు. కిరాణాకొట్లో అప్పుమీద తీసుకొచ్చిన బియ్యం... పైగా రేపు ఆఫీసులో పనిచెయ్యడానికి శక్తి కావాలి కదా! రెండో ముద్ద నోట్లో పెట్టుకున్నాడు రామారావు. దాని రుచి వెంటనే మెదడుకి చేరింది కాని ఎందుకో చేదుగా అనిపించిందతనికి.

"మీ అమ్మ పొద్దుటినుండి తనకి మందులిప్పించకుండా నిర్లక్ష్యం చేస్తున్నామని, తనవల్ల ఉపయోగం ఏమీలేదు కనుక కాటికి పంపించే ఏర్పాట్లు చేస్తున్నామని ఆవిడ భావన. మందులు అయిపోతున్నాయట, అవి అయిపోతే కళ్ళు తిరగడం... నిస్సత్తువతో ఒళ్ళు తూలడం జరుగుతుందట అందుకని మందులు రెండు రోజుల్లో ఇప్పించమంది" అంది.

తన భార్య సర్దుకుబోయే స్వభావం కలది కనుక తననేమీ అనడంలేదు. కానీ తన తల్లి ఎలా కోరంటికం పెడుతుందో మాటల్తో హింసిస్తుందో తనకి తెలియంది కాదు. తనమూలంగా భార్య అయినవాళ్ళతో కానివాళ్ళతో మాటలుపడుతోంది.

తనని పెళ్ళిచేసుకుని ఏమి సుఖపడింది?, భార్య వంక జాలిగా చూశాడు. ఆమె మాత్రం తన గురించి ఏమీ అడగదు. అయినా అడిగితే ఇప్పించగలడా? చేతగానిచవట దద్దమ్మమొగుడు తను.


మౌనాన్ని ఆశ్రయించి గబగబా తినేసి వెళ్ళి పడుకున్నాడు. నిద్దరొస్తేగా! గడువు! హు... అందరూ గడువు విధించేవారే! అసలు ఆ సమయానికి డబ్బు సర్దుబాటు అవ్వద్దూ! అవేవీ వాళ్ళకక్కర్లేదు.

బ్యాంకులు దోచాలా? శాలరీ ద్వారా ఒక వైపునుండి వచ్చే డబ్బు నదీపాయలుగా విడిపోయి వేగంగా అనేక వైపులకి ప్రవహిస్తోంది. దాంతో తన పరిస్థితి ప్రతినెలా రెండోవారం నుండీ ఇలాగే ఉంటోంది.

తను చేసేది ప్రైవేటు ఉద్యోగం. వచ్చేది బెత్తెడు జీతం. ఉండడానికి, తినడానికి, వ్యాధులకీ,పిల్లల చదువులకీ అన్నింటికీ జీతమే శరణ్యం!

సంస్థలన్నీ వివిధకారణాలతో పతనావస్థలో ఉన్నాయి.

మానవవనరులను ప్రతిసంస్థా కుదించేస్తోంది. దినదినగండంగా ఉంది పరిస్థితి. తన స్నేహితుల్లో చాలామంది ఉద్యోగాలు కోల్పోయారు. ఉన్నవాళ్ళకి



**ఒక ప్రైవేట్ కంపెనీలో రామారావు పనిచేస్తుంటాడు. జీతాలు సరిగ్గా ఇవ్వకపోవటంతో అప్పులపాలవుతాడు. ఇంటికి వెళ్ళగానే భార్య చెప్పే అప్పుల చిట్టా అతడిని నిరాశకు గురిచేస్తుంది. ఒకరోజు రామారావు హుషారుగా ఇంటికి వచ్చి భార్యచేతిలో డబ్బుపెడతాడు. మరి ఆ డబ్బు అతనికి ఎలా వచ్చింది...**

జీతం రెండు మూడు నెల్లకోసారిస్తున్నారు. గుడ్డికన్ను కన్నా మెల్ల నయం అన్నట్టుంది ఇప్పటి తన పరిస్థితి. కాని ఏమి చేయగలం?

కుర్రవాళ్ళమైతే మరో రాష్ట్రంలో దేశంలోనో ఉద్యోగం చూసుకునే వీలుంటుంది. కాని యాభై ఏళ్ళు దగ్గరపడుతున్న తనలాంటివాళ్ళు బాధ్యతల్లో కూరుకుపోయుంటారు. నిజంగా విషమపరిస్థితి. కాని ఈ అగమ్యపరిస్థితిలోంచి గట్టెక్కేదెప్పుడు?

వాళ్ళందరూ గడువు విధించినట్టు తను ఆఫీసులో శాలరీ కోసం గడువు ఎందుకు విధించలేకపోతున్నాడు? భయం! తన ఉద్యోగం పోతుందన్న భయం! అదే వాళ్ళకయితే నేను కాకపోతే మరో కోన్ కిస్కా గొట్టంగాడు. తనకి ఒకటే సోర్స్, మరి వాళ్ళకి రకరకాలు! ఏదో చేయాలి.

వ్యాపారం చేసుకోకుండా ఉద్యోగం చేయడం చేతకానితనమే. బతకడం చేతకానివాడికే భయం.

ప్రతి మనిషికీ దేవుడు గడువు ఇస్తాడు. ఆ గడువు లోపలే చేయవలసింది చేయాలి. దేవుడిచ్చిన గడువు ముందు ఇవన్నీ తాత్కాలికమే.

రామారావుకి కొత్త ధైర్యమొచ్చింది. తను కష్టపడి చేస్తాడు కాబట్టి ఉద్యోగం ఎలాగూ ఉంటుంది కాని ఆల్టర్నేట్ సోర్స్ వెతుక్కోవాలి.


అదీ రేపటినుండి మొదలుపెట్టాలి. ఎప్పుడూ లేనంత ధీమాగా నిద్రపోయాడు.

సాధారణంగా పూర్తిగా తెల్లవారకముందే ఇంటికి వచ్చేవాళ్ళకి అసలు సమాధానం చెప్పలేక ఆఫీసుకి (పారిపోయే) వెళ్ళే రామారావు ఆఫీసుకి వెళ్ళకపోయేసరికి ఆయన భార్య ఆశ్చర్యపోయింది.

"నేను ఇవాళ కాసేపయ్యాక ఒక పనిమీద బయట కెళతాను. ఎవరు వచ్చినా నువ్వు సమాధానం చెప్పకు నాకు ఫోన్ చేయమని చెప్పు, నేను చూసుకుంటాను. పాపం ప్రతిరోజూ నిన్ను ఎంతో ఇబ్బందిపెట్టాను.సారీ" అన్నాడు. తనలో వచ్చిన మార్పు తన భార్యకి ఎంత ఆనందం కలిగించిందో ఆమె ముఖంలోని మెరుపు గమనించి అర్థంచేసుకున్నాడు.

అది అతనికి కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. బెడ్రూమ్‌లో కాగితాలు ముందేసుకుని కూర్చుని తనలోవున్న పాజిటివ్ పాయింట్లు రాసుకున్నాడు.

• కొత్త పరిచయాలు పెంచుకోవడం, • వాళ్ళ ఫోన్ నెంబర్లు, డేట్ ఆఫ్ బర్త్‌లు రాసుకోవడం, • చెప్పేది శ్రద్ధగా వినడం, నిదానంగా ఆచరించడం, • అబద్ధాలు సాధ్యమైనంతవరకు చెప్పకపోవడం, • సమయపాలన • చెప్పినదానికి కట్టుబడివుండడం, • ఎంత కష్టమైన పనైనా తప్పించుకుతిరగకపోవడం, • నిజాయితీ, ఈర్ష్య అసూయలు లేకుండా అందరితో కలసిపోయి అనుకున్నది సాధించడం, సలహాలు స్వీకరించడం... ఆచరించడం.




పైవన్నీ రాసుకున్నాక తన సంస్థలో అందరి ఉద్యోగం తీసేసినా తనెందుకు ఉంచారో అర్థమైంది. చిన్నగా ఆనందంతో ఈల వేశాడు.

నీట్‌గా డ్రెస్ చేసుకుని ఓ నమ్మకమైన రియల్ ఎస్టేట్ సంస్థ ఆఫీసుకి వెళ్ళి తన గురించి చెప్పుకుని, తను కూడా కస్టమర్లకి ప్లాటు చూపించి పూర్తిగా ఎక్స్‌ప్లెయిన్ చేసి ప్లాట్ కొనేలా చేస్తానని, తనమీద నమ్మకం వుంటే శాలరీ కాకుండా సరైన కమీషన్ ఏ రోజుకారోజే ఇవ్వమని రిక్వెస్ట్ చేశాడు.

వాళ్ళు ఆ ప్రపోజల్‌కి అంగీకరించి అతనికి ప్లాట్ల గురించిన పూర్తివివరాలు అందించారు.

రామారావు వాళ్ళని ప్రత్యర్థుల ప్లాట్ల వివరాలు కూడా అడిగి తీసుకుని మరో అరగంటలో వాళ్ళ ప్లాట్లకీ, తమ ప్లాట్లకి వున్న తేడా పట్టిక తయారు చేసుకున్నాడు.

వాళ్ళు మధ్యాహ్నభోజనం పెట్టించి నాలుగుగంటలకి కస్టమర్లతో ఉన్న వ్యానులో అతన్ని పంపించారు.

వ్యానులో వెళుతున్న సమయాన్ని కస్టమర్లకి తన మీద సదభిప్రాయం కలిగేలా చేసుకుని దిగిన తర్వాత స్థలం చూపించి ఎటువంటి సమస్యలూ లేని క్లియర్ టైటిల్ స్థలం సరసమైన ధరలో తీసుకుంటే కలిగే లాభాలేంటో చక్కగా వివరించాడు. దాదాపు అందరూ అక్కడే అడ్వాన్సులు కట్టేశారు.

ఆ రియల్ఎస్టేట్ మేనేజరు కూడా మంచివాడవడంతో రాత్రి రామారావుకి రావలసినది లెక్కకట్టి ఇచ్చేశాడు. రామారావుకి చాలా సంతోషం కలిగింది.

ఇంటికెళ్ళాడు. తలుపు కొట్టగానే భార్య తలుపు తీసింది. జేబులోంచి డబ్బుతీసి భార్య చేతిలో పెట్టి "సుజా! నా కష్టసమయంలో నాతోపాటు బాధలు భరించావు. ఇప్పుడు బాధలు లేవు, భయాలు లేవు. అంతా సంతోషమే!

ఒక ఆలోచన జీవితాన్నే మార్చేస్తుందన్నది నిజమే. రేపు ఈ డబ్బు పాప స్కూలుకు కట్టేయి. త్వరలోనే గడువులోగా మిగతావి తీర్చేద్దాం!" అని భార్య చేతి ముద్దులు తిని హాయిగా పడుకున్నాడు.

మరుసటిరోజునుండి మూడురోజులు కూడా ఆఫీసుకి సెలవుపెట్టి రియల్ఎస్టేట్ ఆఫీసుకి వెళ్ళాడు. డబ్బు సంపాదించాడు. బాకీలన్నీ గడువులోగా తీర్చేశాడు. ఇన్స్యూరెన్స్ ఏజెన్సీ తీసుకున్నాడు.వాటికి తన పరిచయాలు ఎంతగానో ఉపకరించాయి.

సెలవు పూర్తయ్యాక ఆఫీసుకి వెళ్ళాడు.ఎవరో తను చేస్తున్న పనులు పర్సనల్ డిపార్ట్‌మెంట్‌కి ఉప్పందించారు. పర్సనల్ మేనేజరు పరిచయస్తుడే, పైగా మంచివాడు. రామారావుని పిలిచి విషయం అడిగాడు.

రామారావు ధైర్యంగా తన పరిస్థితులు చెప్పి "సమయానికి శాలరీ రాకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నానని, మానసిక ఒత్తిడి కలుగుతోందనీ-

ఆఫీసు పనికి ఇబ్బంది లేకుండా సంపాదనమార్గాలు వెతు క్కుంటున్నానని, శాలరీ సరైన సమయానికివస్తే అలాం టివి చేయాల్సిన అగత్యం తనకుండదని, కాదు కూడ దంటే తాను రిజైన్ చేసేస్తానని" అన్నాడు.

దాంతో "సరే ఆఫీసుపనికి ఎటువంటి విఘాతం కలగకుండా చూసుకోమని" చెప్పి పంపించేశాడు.

ధైర్యమున్న వ్యక్తికి చావుండదు. గడువుని తిట్టుకునే రామారావు అదే గడువుని ఇప్పుడు గౌరవిస్తాడు. గడువు లేకుంటే తను బద్ధకంగా నిద్రావస్థలోనే కాలం గడిపేవాడినని భార్యకి చెబుతుంటాడు.

సంవత్సరం తర్వాత ఆర్థికంగా నిలదొక్కుకున్న రామారావుని చూసినవాళ్ళు ఆశ్చర్యపోయారు. విచిత్రమేమిటంటే అప్పుడు ఉద్యోగాలు పోయినవాళ్ళు ఇంకా ఉద్యోగాలు వెతుక్కుంటూనే వున్నారు.